క్లుప్తంగా

ధాన్యం లోడ్ అడ్డగింత



అయిజ: మండల పరిధిలోని పులికల్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నాగలదిన్నెకు చెందిన రంగయ్యశెట్టి 80 బస్తాల వరి ధాన్యాన్ని తరలిస్తుండగా పులికల్ గ్రామ రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం తరలింపును రైతులు అడ్డుకుంటే తప్పా చర్యలు తీసుకోవడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయపై ఐకేపీ ఏపీఎం అన్నపూర్ణను వివరణ కోరగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం



గట్టు: మండల పరిధిలోని బల్గెర గ్రామంలో బుధవారం ఆధునికీకరించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బల్గెర హనుమంతునాయుడు ప్రారంభించారు. భవిష్య భారత్ సంస్థ అంగన్‌వాడీ భవన అభివృద్ధికి సహకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో బాసు గోపాల్, నూర్‌పాష, సామేలు, రాజు, బుగ్గన్న, భవిష్య భారత్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు శోభమ్మ, కవితమ్మ, లక్ష్మి, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్



అయిజ: రాజోళి మండలం పెద్దధన్వాడ సమీపంలో నిర్మించ తలపెట్టిన ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటారన్నా సమాచారం మేరకు బుధవారం తెల్లవారుజామున పోలీసులు బీఆర్‌ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం 4 గంటల అనంతరం వారిని విడిచిపెట్టారు. అరెస్ట్ అయిన వారిలో పల్లయ్య, వెంకట్రాములు తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకండా పోరాడుతున్న ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

సదస్సుల నిర్వహణపై సమాచారం ఇవ్వరా ?

ఉండవెల్లి: మండలంలోని భూభారతి రెవెన్యూ సదస్సులపై మండల ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులకు ఎలాంటి సమాచారం అందించడం లేదని కంచుపాడు మాజీ సర్పంచ్ శేషన్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లో వేలల్లో భూ సమస్యలు ఉన్నాయన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసినా, ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడం అధికారుల నిర్లక్ష్యమని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి రెవెన్యూ సదస్సులపై ముందుగానే సమాచారం అందిచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

‘యువ వికాసం’ పేరిట యువతకు టోకరా

అమరచింత: రాజీవ్ యువవికాసం పథకం పేరిట నిరుద్యోగ యువకులను ప్రభుత్వం మోసగిస్తుందని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ మండిపడ్డారు. పట్టణంలోని శ్రీకృష్ణనగర్‌లో స్థానిక యువకులతో కలిసి రాజీవ్ యువవికాసం దరకాస్తుదారులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. రూ.లక్ష రుణాలు ఇవ్వడానికి ఎక్కడా లేని నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. రూ.3 నుంచి 4 లక్షల వరకు రుణాలు ఇస్తామన్న సర్కారు నేడు మాట మార్చి రూ.50 వేలు, రూ.లక్ష వరకే రుణాలు అందిస్తున్నామడం హస్యాస్పదంగా ఉందన్నారు. బ్యాంక్‌లో ఖాతాలు కలిగి లావాదేవీలు చేస్తూ సిబిల్ స్కోర్ ఉన్న వారికే రుణాలు మంజూరు చేస్తామని బ్యాంకర్లు చెప్పడం సరికాదన్నారు. దరకాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ తక్షణమే రుణాలు ఇవ్వాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అనురాగ్, చేతన్, ఆదర్శ్, తేజ, విశాల్ పాల్గొన్నారు.

‘ఆయిల్‌పాం’తో అధిక లాభాలు



మానవపాడు మండలం గోకులపాడు శివారులో సాగు చేసిన ఆయిల్‌పాం పంట

- అధిక మొత్తంలో రాయితీ
- టన్నుకు రూ. 21వేల మద్దతు ధర

మానవపాడు: రైతులకు పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా వంట నూనెల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించేలా ఆయిల్‌పాం సాగును రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ఈ క్రమంలో మొక్కల కొనుగోలు, డ్రిప్పుతో పాటు మద్దతు ధర కల్పించేలా సాగుకు అవగాహన కల్పిస్తుంది. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుండటంతో రైతుల ఆయిల్‌పాం సాగుకు ముందడుగు వేస్తున్నారు. ప్రజాప్రతినిధులు సైతం రైతులను ప్రోత్సహిస్తున్నారు. వర్షాధారం, నీటి వినియోగం ఎక్కువగా ఉన్న పంటల వైపు రైతులు మరలకుండా, అదే విధంగా పంట నష్టాలు చవిచూడకుండా ఆయిల్‌పాం సాగుకు ప్రోత్సహకాలు అందజేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 1,651 మంది రైతులు 6,465 ఎకరాల్లో ఆయిల్‌పాం సాగు చేపట్టారు. అదే విధంగా అంతర్ పంటను సాగు చేస్తూ అధిక లాభాలను పొందే అవకాశం ఉండటంతో సాగుకు ప్రోత్సహకాన్ని అందిస్తున్నారు.

రాయితీ ఇలా...

ఆయిలపాం సాగు చేసే రైతులకు ముందుగా అధికారులు పంట సాగుపై అవగాహన కల్పించడంతో పాటు రాయితీ వివరాలను వెల్లడిస్తారు. మొక్కల కొనుగోలులో సైతం ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. దీంతో ఆయిల్‌పాం సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గ చూపుతున్నారు. మొక్కలపై రూ.11,600, డ్రిప్పుపై రూ.21,200, నిర్వహణ కోసం రూ.16,800 తెలంగాణ కోపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్‌పాం తోటల అభివృద్ధికి గణనీయమైన రాయితీతో అద్భుతమైన అవకాశాన్ని అందిస్తోంది. మొక్కల కొనుగోలులో మొక్కకు రూ.195 అందులో రైతు రూ. 20 చెల్లిస్తే మొక్కలు అందిస్తారు. డ్రిప్‌కు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీ కాగా బీసీలకు 90 శాతం, ఓసీ రైతులకు 80 శాతం మేర రాయితీ అందిస్తున్నారు.

టన్నుకు రూ. 21వేలు.

ఆయిల్‌పాం మొక్కలు సాగు చేపట్టిన మూడేళ్ల అనంతరం పంట దిగుబడి ప్రారంభమవుతుంది. దిగుబడి వచ్చే నాటికి టన్నుకు రూ. 21వేలు మద్దతు ధర లభిస్తుంది. దీంతో రైతులు అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. అదే విధంగా ఈ మూడేళ్లలో ఆయిల్‌పాం సాగుతోపాటు అంతర్ పంటలను సైతం సాగు చేసుకునే వీలుంది. ఇలా 30 ఏళ్ల పాటు ఆదాయం పొందే అవకాశం ఉండటంతో రైతులు సాగు చేయడానికి మొగ్గు చూపుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఆయిల్‌పాం సాగు వివరాలు..

మండలం	రైతులు	ఎకరాల్లో సాగు
అయిజ	325	1235.93
ధరూర్	251	961.61
మల్దకల్	206	833.09
గద్వాల	167	758.16
రాజోళి	130	494.38
గట్టు	145	488.36
కేటీదొడ్డి	108	419.15
వడ్డేపల్లి	109	401.48
ఇటిక్యాల	113	399.20
మానవపాడు	56	249.61
ఉండవెల్లి	26	151.28
అలంపూర్	15	72.50

అధికారులు విఫలం..



గ్రామీణ ప్రాంతాల్లో ఆయిల్‌పాం సాగుపై పూర్తిస్థాయిలో అధికారులు విఫలమౌతున్నారు. రైతులకు క్షేత్ర స్థాయిలో రాయితీపై, దిగుబడిపై అంతర్ పంటలను సాగు చేసే విధానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

– మల్లికార్జున్‌రెడ్డి, మానవపాడు

రాయితీలపై అవగాహన లేదు



గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు ఆయిల్‌పాం సాగు విధానం, రాయితీలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం లేదు. గ్రామాల వారీగా అధికారులు రాయితీ, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించాలి.

– ఆత్మలింగారెడ్డి, మాజీ సర్పంచ్ కలుకుంట్ల

అవగాహన కల్పిస్తున్నాం..

మండలాల వారీగా స్థానిక అధికారులతో కలిసి ఆయిల్‌పాం సాగు, సబ్సిడీ గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయిల్‌పాం ఒక్కో మొక్క రూ.195 అందులో రైతు రూ. 20 చెల్లిస్తే మొక్కలు అందిస్తారు. డ్రిప్‌కు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీ కాగా బీసీలకు 90 శాతం, ఓసీ రైతులకు 80 శాతం మేర రాయితీ లభిస్తుంది.

– ఎంఏ. అక్బర్, జిల్లా ఉద్యానశాఖ అధికారి జోగుళాంబగద్వాల

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

అలంపూర్: కర్నూలులోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే విజయుడు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు చెందిన 16 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.3.90 లక్షల విలువగల చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. అదే విధంగా ఎర్రవల్లి మండలం కొండపేట గ్రామానికి చెందిన నర్సింహులు ఆపరేషన్ నిమిత్తం సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.4 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు పేర్కొన్నారు.



సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

ఎల్‌ఓసీ అందజేత

ఎర్రవల్లి: మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన కుమ్మరి రాముడు కుమారుడు బద్రీనాథ్ పుట్టుకతో వినికిడి లోపం, మాటలు రాక బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో అతని వైద్య ఖర్చుల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌ను ఆర్థిక సాయం కావాలని బాధితులు కోరారు. స్పందించిన ఆయన బాలుడికి వినికిడి యంత్రాల అమరిక కోసం రూ.8 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేయించి బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దీపక్ ప్రజ్ఞ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వెంకటేష్‌యాదవ్, డాక్టర్ ప్రణయదీపిక, మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ మీడియం బడులను బలోపేతం చేయాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ద్వారా ఉర్దూ మీడియం పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతూ బుధవారం కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌కు ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న ఉర్దూ మీడియం పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైనసౌకర్యాలు కల్పించాలని, డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మసీదుల్లో లైబ్రరీలు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం కొత్వాల్‌ను సొసైటీ ప్రతినిధులు శాలువాతో సత్కరించారు. జహంగీర్‌బాబా, మహ్మద్ యాకుబ్, షేక్ మహెమూద్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగించుకోవాలి

సాక్షి నెట్‌వర్క్: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ అలివేలు అన్నారు. బుధవారం ధరూరు మండల పరిధిలోని దోర్నాలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఆమె హాజరై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అదే విధంగా తహసీల్దార్ నరేందర్ ఆధ్వర్యంలో మిర్జాపురంలో రెవెన్యూ సదస్సులో రైతుల అందజేసిన దరఖాస్తులు పరిశీలించారు.

☆ అలంపూర్ మండలం భీమవరం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను తహసీల్దార్ మంజుల స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి, ఆర్‌ఐలు దుర్గాసింగ్, మాసుంబాష, రెవెన్యూ సీనియర్ సహాయకులు సుచిత్ర, ఆంజనేయులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

☆ కేటీదొడ్డి మండలం ఇర్కిచేడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరికృష్ణ రైతులు అందించిన 16 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్, ఆర్ఐ అశోక్, సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి, భీమయ్య, ఆపరేటర్లు లక్ష్మణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

☆ వడ్డేపల్లి మండల పరిధిలోని కోయిల్‌దిన్నె గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీల్దార్ వీరభద్రప్ప రైతుల నుంచి వివిధ భూసమస్యలకు సంబంధించి 23 దరఖాస్తులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

☆ మల్దకల్ మండలం అమరవాయి, కుర్తిరావల్‌చెర్వు గ్రామాల్లో అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీరాణి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా గ్రామాల రైతుల నుంచి 150పైగా దరఖాస్తులు వచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.



దోర్నాల రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న డీఆర్డీఓ అలివేలు

☆ భూ సమస్యలను పరిష్కరించడం కోసమే ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు అలంపూర్ మార్కెట్ యార్డు చైర్మన్ దొడ్డెప్ప అన్నారు. ఎర్రవల్లి మండల పరిధిలోని కొండేరులో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ నందినితో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు శంషీర్, శ్రీనివాస్, ఎస్ఏ నరేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

☆ అయిజ మండలంలోని చిన్నతాండ్రపాడు, తూంకుంట గ్రామాల్లో తహసీల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

☆ ఉండవెల్లి మండలంలోని బొంకూరు, కలుగోట్ల గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులో 6 దరఖాస్తుల మాత్రమే వచ్చినట్లు తహసీల్దార్ ప్రభాకర్ తెలిపారు.



కోయిల్‌దిన్నెలో దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

☆ గట్టు మండలం పెంచికలపాడు, చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను పెంచికలపాడులో తహసీల్దార్ మదన్‌మోహన్‌గౌడ్, చమన్‌ఖాన్‌దొడ్డిలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పెంచికలపాడులో 122, చమన్‌ఖాన్‌దొడ్డిలో 14 దరఖాస్తులు మొత్తం 136 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.



కొండేరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న మార్కెట్‌యార్డు చైర్మన్ దొడ్డప్ప



ఇర్కిచేడులో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ హరికృష్ణ



కుర్తిరావల్‌చెర్వులో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీరాణి

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



అలంపూర్ సీహెచ్‌సీలో యోగా ఫర్ వన్ హెల్త్ వన్ ఎర్త్ ర్యాలీ



ఇటిక్యాలలో యోగాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అలంపూర్: ప్రతి నిత్యం యోగా చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారి సవిత అన్నారు. పట్టణంలో సీహెచ్‌సీలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ యోగా వారోత్సవాల్లో భాగంగా బుధవారం యోగా ఫర్ వన్ హెల్త్.. వన్ ఎర్త్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా యోగా చేయాలన్నారు. యోగాతో మానసిక ప్రశాంత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ యాస్మిన్, ఏఎన్‌ఎం సురేఖ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు చక్కటి ఆరోగ్యం

ఇటిక్యాల: విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తొలగించడంలో యోగా ప్రముఖ పాత్ర పోషిస్తుందని ఆయుష్ మండల వైద్యాధికారి ముబీనా తబసుమ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో యోగా దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాష్ట్ర ఆయుష్ విభాగం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న యోగా మాసోత్సవాల్లో ఆమె మాట్లాడారు. నిత్యం యోగా సాధన చేయడం వల్ల ప్రజలకు శారీరక ఆరోగ్యంతో పాటు ప్రశాంతత చేకూరుతుందన్నారు. ఆయుష్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూన్ 21 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆయూష్ డిపార్ట్‌మెంట్ నేతృత్వంలో యోగాపై అవగాహన సదస్సులు, కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నరేష్, శివాని,దేఎస్‌ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల వైపు రైతులు మరలాలి

మానవపాడు: వాణిజ్య పంటల సాగు వైపు రైతులు మరలాలని ఎమ్మెల్యే విజేయుడు అన్నారు. బుధవారం మండలంలోని జల్లాపురం రామిరెడ్డికి చెందిన 12 ఎకరాల్లో ఆయిల్‌పాం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జల్లాపురంలో దాదాపు 60 ఎకరాల్లో, మండల వ్యాప్తంగా దాదాపు 250 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అదే విధంగా ఆయిల్‌పాం పంట సాగులో అంతర్గత పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఎం.ఎ అక్బర్, డివిజనల్ ఉద్యాన అధికారి ఇమ్రానా, మండల వ్యవసాయ అధికారి సందీప్‌కుమార్, ఏఈఓ మణిప్రకాశ్, ఆయిల్‌పామ్ క్షేత్ర స్థాయి బృందం, రైతులు పాల్గొన్నారు.



జల్లాపురంలో ఆయిల్‌పాం మొక్కలు నాటుతున్న నాయకులు, అధికారులు

బాలికలను వేధిస్తే చర్యలు తప్పవు

రాజోళి: బాలికలను వేధించిన వారిపై కఠిన చర్యలు తప్పవని చైల్డ్ వెల్ఫేర్ అధికారి లక్ష్మీదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బాల్య వివాహాలు, బాలికల రక్షణ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతే బాలికలకు వివాహం చేయాలని, అబ్బాయిలకు 21 సంవత్సరాలు నిండాలన్నారు. బాలకలను శారీరకం, మానసికంగా వేధించిన వారికి 3 ఏళ్లు, లైంగికంగా వేధిస్తే 7 ఏళ్ల జైలుశిక్ష తప్పదని హెచ్చరించారు. యుక్త వయసు రాకముందే వివాహాలు చేసినా, వారికి సహకరించిన వారు జైలు పాలవుతారని హెచ్చరించారు. అదే విధంగా బాలకార్మిక వ్యవస్థ కూడా నేరమన్నారు. బడిఈడు పిల్లలందరని పాఠశాలలో చేర్పించి వారి విద్యాభివృద్ధికి తోడ్పాటు నందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తల్లిదండ్రులు, బాల బాలికలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైల్డ్ వెల్ఫేర్ అధికారి లక్ష్మీదేవి

నీటి కష్టాలు.. బిందెల బారులు



ఉండవెల్లిలో నీటి బిందెల క్యూలైన్



నీటి కోసం నిల్చున్న మహిళలు

ఉండవెల్లి: మండలంలో మిషన్ భగీరథ నీరు సరఫరా కాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత మూడు రోజులుగా నీటి కోసం తంటాలు పడుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో రెండు ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తున్నారని అవి ఎంతకు సరిపోవడం లేదంటున్నారు. బైరాపురం గ్రామంలో పెద్దమ్మ దేవర నిర్వహిస్తుండటంతో గ్రామస్తులతో పాటు జాతరకు వచ్చిన బంధువులు కూడా నీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు వాపోతున్నారు. నీటి కష్టాలు ఇంకెన్ని రోజులు పడాలో అని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యం

ఆత్మకూర్: రైతులు పంటల సాగులో అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు పాలెం పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రాంరెడ్డి, డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వ్యవసాయశాఖ, హార్టికల్చర్, వెటర్నరీ శాఖల ఆధ్వర్యంలో బుధవారం ఆరేపల్లి రైతు వేదికలో అధిక సాగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలని, పచ్చిరొట్టె ఎరువులను వాడాలని, వరికొయ్యలను పొలంలోనే దున్ని నేలసారాన్ని పెంచాలని సూచించారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ వినయ్‌కుమార్, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యుగంధర్‌రెడ్డి, ఏఈఓలు సంతోష్, ఝాన్సీ, రైతులు పాల్గొన్నారు.



ఆరేపల్లిలో రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్తలు

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్‌లో గురువారం నుంచి మూడు రోజుల పాటు సీతారామాంజనేయ స్వామి, సత్యనారాయణ స్వామి విగ్రహ ప్రతిష్ఠ, ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 5వ తేదీన మహాగణపతి పూజ, గోపూజ, యాగశాల, మండప పూజ, 6న రుద్ర పారాయణం, ఆవాహిత దేవతా పూజలు, రుద్రాభిషేకం, 7న విగ్రహాల ప్రతిష్ఠ, ధ్వజస్తంభ, బొడ్రాయి ప్రతిష్ఠ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించే పూజల్లో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.



ముస్తాబైన సీతారామాంజనేయస్వామి ఆలయం